సుందరి స్వగతం

ఎదురింట్లో పెండ్లి జరుగుతోంది।

ఎలా జరుగుతోంది?

రంగ రంగ వైభవంగా జరుగుతోంది।

కిటికీ దగ్గర బల్లమీద కూర్చున్న సుందరి కళ్ళు ఆ వైభవాన్ని అత్యంత కుతూహలంగా తిలకిస్తున్నాయ్। అంతటి వైభవాన్ని చూస్తున్న ఆనందం తాలూకు ఛాయలు ఆమె కళ్ళల్లో స్పష్టంగా ప్రతిఫలిస్తున్నాయ్।

పెద్ద షామియానా వేశారు।

రంగు రంగుల దీపాల తోరణాలు వ్రేలాడదీశారు।

దానికింద ఎత్తుగా కళ్యాణ మండపం కట్టారు।

ముంగిట్లో ఎర్రటి యూనిఫారంలో వున్న బ్యాండు మేళం వరస వెంబడి నిలిచి వున్నారు.

అనేక రకాల ఖరీదయిన వాహనాలు బారులు తీర్చి వున్నాయ్. నగరంలోని ప్రముఖులంతా అక్కడే సభ తీర్చారా అన్నట్లు ఆడంబరంగా వుంది వాతావరణం. రకరకాల పట్టు చీరలు, విలువైన కోట్లు, ఖరీదయిన సూట్లు! పెళ్ళి పందిరి ఆహూతులతో కళకళలాడి పోతోంది।

పెళ్ళికూతురు రాధిక విలువైన ఆభరణాలు ధరించి ఖరీదైన పట్టుచీరతో మెర్క్యూరీ కాంతిలో అపరలక్ష్మిలా ధగధగా మెరిసిపోతోంది।

పెళ్ళికొడుకు విదేశాలలో చదువుకుని వచ్చాడుట! ఎర్రగా, ఎత్తుగా రాజఠీవిలో వున్నాడు.

ఆ జంటను చూడటానికి రెండు కళ్ళు చాలవు। ''నిజంగా పెళ్ళి వేడుక అంటే అలాగ వుండాలి! రంగరంగ వైభవంగా!'' స్వగతంలో సుందరి ప్రశంసగా అనుకుంది.

కాని అంతలోనే ఆమె మనస్సు సన్నగా నిట్టూర్చింది।

''హుం....ఏడాది క్రితం తనకీ జరిగింది పెళ్ళి! ఎలా జరిగింది?''

ఇంటి ముందు నాలుగు పుచ్చిపోయిన గుంజలు పాతి పచ్చికొబ్బరి ఆకులతో పందిరి అల్లారు. మామిడి తోరణం కట్టారు. రెండు పెట్రొమాక్సు లైట్లు తెప్పించారు. ముసలయ్య కొడుకుతో వచ్చి డోలు సన్నాయి మ్రోగించాడు. అంతే! తన మెళ్ళో మూడుముళ్ళూ పడ్డాయి. తనకి పెళ్ళి జరిగిపోయింది. వెయ్యిన్నూట పదహార్లు కట్నం ఇయ్యటానికే తల తాకట్టు పెట్టాడు నాన్న! అందువల్ల తను ఒక మంచి పట్టుచీర కూడా కొనుక్కోలేకపోయింది।

పెళ్ళికొడుకు శంకరం....ఆదే....తన భర్త మాత్రం ఎలా వున్నాడు? నల్లగా పోతపోసిన విగ్రహంలా వున్నాడు। మొఖాన ఇంత 'కళ' అయినాలేదు. తుమ్మల్లో ప్రొద్దు క్రుంగినట్లు ఎప్పుడూ మటమచే! చూడగానే తనకి కడుపులో తిప్పింది।

పానకం బిందెల్లో చేతులు పెట్టినప్పుడు నల్లని తుమ్మ చెక్కలాంటి అతని చెయ్యి ప్రక్కన తెల్లటి తన చెయ్యి మరీ బంగారంలా మెరిసిపోయింది.

పందిట్లో వున్న వాళ్ళంతా ముక్కున వేలేసుకున్నారు!

''కాకి ముక్కుకి దొండపండు'' అన్నారు. కాని తన అత్తగారు ఏమంది?

''మా శంకరానికి ఆరువేలకు పైగా ఇస్తామని వస్తున్నారు. ఏదో .... అయినవాళ్ళం కదా అని ఈ సంబంధం కలుపుకున్నాం. ఘనంగా లాంఛనాలు లేవు మర్యాదలూ లేవు!'' అంటూ మూతి విరిచింది.

అంతేగాని..''పిల్ల బాగుందని చేసుకున్నాం'' అని ఛస్తే అనదే। అవిడ్ని చూస్తే తనకి ఒళ్ళు మండిపోయింది।

నిజం చెప్పాలంటే ఆ పెళ్ళి తను మాత్రం 'పడి పడి' చేసుకుందా? గతిలేక చేసుకుంది. ఇంకా చెప్పాలంటే తల్లిపోరుపడలేక తల ఒగ్గింది.

అసలు తనకి ఊహ తెలిసినప్పట్నుంచి ఎన్ని కలలు? ఎన్ని కోరికలు?....

డబ్బు లేకపోయినా ఫరవాలేదు. తన కంటికి నచ్చిన భర్త రూపాన్ని కోరుకుంది. అతడు పట్టు చీరలు నగలు తేనక్కరలేదు. మంచి సరసుడు, సహృదయుడు కావాలని ఆశించింది.

తెచ్చిన పదిపైసల మల్లెపూలు అయినాసరే....

"సుందీ! నీ కోసం తెచ్చాను. ఊఁ...." అంటూ తన భుజాల చుట్టూ చెయ్యి తిప్పి ఆప్యాయంగా దగ్గరికి తీసుకునే భర్తని కోరుకుంది. కాని.... కాని.... ఏం జరిగింది? తన బ్రతుక్కి ఆ చిన్న ముచ్చట కూడా కరువు అయిపోయింది".

గాఢంగా రాబోతున్న నిట్టూర్పుని ఆపుకుంది సుందరి.

"తన భర్త శంకరానికి ఓ సరసం తెలియదు సరదా తెలియదు. ఆ మోటు అవతారానికి తగ్గదే ఆయనగారి అభిరుచీనూ ఛీ...."

నాలుగు రూపాయిలు జేబులో వుంచేదాలు తాగటం, పేకాడటం అర్ధరాత్రి ఎప్పుడో పక్కమీదికి వస్తాడు. జన్మకో శివరాత్రి అన్నట్లు ఆ సొగసుకి తోడు సాయంత్రం ఎప్పుడో కొన్న పూల సంగతి అప్పుడు జ్ఞాపకం వస్తుంది కాబోలు! పాంట్ జేబులో నలిగిపోతున్న పూలపొట్లం తీసి తన మంచం మీదికి విసురుతాడు. పామో తేలో మీదకి వచ్చి పడినట్లే అనిపిస్తుంది. కాని పూల చెండు తగిలిన అనుభూతే అందదు! 'బ్రాంది' కంపుకొట్టేనోరు, ఎర్రటి కళ్ళు ... ఏ గొంగళి పురుగో మీద ప్రాకినట్లు తనకి ఒళ్ళు జలదరిస్తుంది.

పగటిపూట తనతో అసలు మాట్లాడడు! అన్నింటికి అమ్మనే పిలుస్తాడు, అమ్మకూచి!

"ఒరేయ్ నాయనా! నా తండ్రి! శంకిగా...." అంటూ తన అత్తగారూ అంతే! తలకి నూనె రాయటం దగ్గర్నుంచి విస్తట్లో అన్నం వడ్డించటం వరకూ అద్దాల్లో బిడ్డడ్ని చూసుకున్నట్లు తెగ అపురూపం చూపెడుతుంది!

ఆ ప్రేమలో, కొడుకు ఎక్కడ కోడలి పరమైపోతాడో అన్న శాపత్రయమే కనుపిస్తుంది కాని సహజత్వం తోచదు. అయినా తనకి మాత్రం అంత తీరిక ఎక్కడ చచ్చింది? లేచింది మొదలు చాకిరి! చాకిరి!! ఈ ప్రపంచంలో అసలైన వెట్టిచాకిరి చేసే బానిసబ్రతుకు ఆడదానిది! అత్తంటి కోడలిది! ప్రభుత్వం ముందుగా నిర్మూలించాల్సింది ఈ వెట్టిచాకిరీనే!........

అంత చాకిరి చేసినా తన "అత్త"కి తృప్తి లేదు! ఆపేక్షలేదు. "కోడల్ని అత్త సాధించటం జన్మహక్కు" అన్న నియమం పెట్టుకున్నదానిలా ప్రతిక్షణం పాటిస్తుంది. సాధించని రోజు తన హోదా తరిగిపోయినట్లు, తన పెద్దరికం దెబ్బ తిన్నట్లు తెగబాధపడిపోతుంది! తన ఆడపడుచులు తల్లికి వంతపాడతారు! వాళ్ళు రేపు అత్త వారింటికి వెళ్ళరో ఏమో!

కష్టం సుఖం తనకి భర్తతో చెప్పుకొనే స్వాతంత్ర్యం లేదా! అతగాడి దృష్టిలో తానొక యంత్రం. ఏనాడైనా పొరపాటున రాత్రిపూట గదిలో అత్తగారి గురించి చెప్పబోతే....

"ఇదిగో....మా అమ్మ చాలా మంచిది. నోరుమూసుకుని పడివుండు. మా నాన్న పోయిన దగ్గర్నుంచి మమ్మల్ని కంటికి రెప్పలాగ కాపాడింది. మా అమ్మ గురించి నా దగ్గర ఇంకో మాట అన్నావంటే మర్యాద దక్కదు. అంత కష్టంగా వుంటే పుట్టింటికి పో...." అంటూ కళ్ళు ఎర్రగా చేసి హుంకరిస్తాడు.

"అమ్మ"గా అతనికి మంచిదే. కాని అత్తగా తనకి మంచిది కాదే! కాని ఆ విషయం అతనికి బోధపడదు.

అదే....తల్లి గనుక "ఒరేయ్ శంకరా! మీ ఆవిడ చూశావట్రా?...."అంటూ తన మీద ఏదైనా చాడి చెపితేచాలు ముందు వెనుక ఆలోచన అయినా లేకుండా తన వీపు వంగదీసి "ధబీ ధబీ" మని బాదతాడు. జుట్టుపట్టి గోడకేసి కొడతాడు. నెత్తురు బొట బొట కారి, బొప్పి కట్టాల్సిందే. తన అభిమానం చచ్చిపోతుంది. అందుకే నోరు ఎత్తటం మానివేసింది. అదింకా అలుసు అయిపోయింది.

"మగడు కొట్టినందుకు కాదు – ఆడబిడ్డ నవ్వినందుకు ఏడ్చాను"....అందిట వెనకటికో ఇల్లాలు! అంతే మరి!

భార్య మీద మమకారం వుండాలి. అంత మాత్రం చేత తల్లి మీద ఆపేక్షని ఒదులుకోనవసరం లేదు! తల్లి మీద గౌరవాభిమానాలు వున్నంత మాత్రాన భార్యని నిరసించనక్కర్లేదు! మనిషికి రెండు కళ్ళూ ముఖ్యమే. ఒక కన్ను వుంది కదా (అవసరం గడుస్తుంది) అని రెండో కన్నుని పొడుచుకుంటామా? దేనివిలువ దానిదే! ఏ వయసుకి ఆ ముచ్చట వుంటేనే అందం–ఆనందం!....

ఆరోగ్యవంతుడైన యువకుడికి సహజంగా వయసులో భార్య పట్ల ప్రేమకోరిక వుంటుంది. తల్లి పట్ల భక్తిభావం వుంటుంది. కాని తన భర్త శంకరం రోగిష్టి. శృంగారం అక్కర్లేదు. సరదా అక్కర్లేదు. సరసం అక్కరలేదు. ముప్పొద్దులా తిండి పెట్టి కాళ్ళొత్తి సేవ చేసేవాళ్ళు కావాలి.

అందుకే సంసారం అంటే తనకి మరీ ఏవగింపు కలిగింది. భర్త దగ్గర తగినంత చొరవా స్వాతంత్ర్యం అసలే లేవు. కాగా భయం. ఇంక ప్రేమ పుట్టుకురమ్మంటే ఎట్లా వస్తుంది?...

భర్త నిరసన, అత్తగారి సాధింపు, ఆడబిడ్డల ఆరళ్ళతో తాను విసిగిపోయింది. మానసికంగా, శారీరకంగా తాను అలిసిపోయింది. ఇరవై ఏళ్ళకే అరవై ఏళ్ళ వైరాగ్యం వచ్చిపడింది.

"మంచుటెండలో మలయమారుతంలా" అప్పుడప్పుడూ పుట్టింటికి వస్తే కాస్త ఇలా ప్రాణం హాయిగా వుంటుంది.

పండగో పబ్బమో వస్తే....నాన్న ఈసారి పిలిస్తే బాగుడ్ను. పండక్కి రమ్మని ఉత్తరం రాస్తే బాగుడ్ను. తనని తీసుకుని వెళ్ళడానికి అన్నయ్యా అయినా రాకపోతాడా? — అని ఆలోచిస్తుంది. పండగ ఇంకో పది రోజులు వుండనగానే వాళ్ళ రాకకోసం గడపలో రోజూ ఎదురుచూస్తుంది.

"ఒరేయ్ అన్నయ్యా! మీ ఆవిడకి నీ కంటె పుట్టింటి మీదనే ప్రేమ ఎక్కువరా!" అని ఎగదోస్తుంది తన పెద్ద ఆడపడుచు.

అత్తింట్లో కూడా అభిమానం ఆప్యాయత దొరికితే – ప్రేమించే భర్తని విడిచి ఏ ఆడపిల్ల మాత్రం పుట్టింటికి పరిగెడుతుంది?.... ఆ మాత్రం తెలుసుకోలేరు కాని సాధించటం మాత్రం తెలుసు.

అన్నయ్యకి కొడుకు పుట్టాడు. వాడికి ఆరు నెలలు వచ్చాయి. తనకి చూడటమే పడలేదు! పైగా పెద్దక్క కూడా ముగ్గురు పిల్లలతో వచ్చింది. అంతా పది రోజులపాటు కలిసి ఆనందంగా గడపవచ్చని పుట్టింటికి వచ్చింది. ఇప్పుడు ప్రాణానికి హాయిగా వుంది.

"మీ అక్క పిల్లలు వచ్చారు అంటున్నావ్ కనుక పంపుతున్నాను. ఓ వారం రోజులు వుండి

వెంటనే వచ్చేయ్!'' అని ఖచ్చితంగా మరీ మరీ చెప్పాడు తన భర్త శంకరం వచ్చేస్తుంటే!

తన అత్తగారు ఆ మాత్రం కూడా ఒప్పుకో లేదు! తనమీద ప్రేమ చేత కాదు! తను లేక పోతే ఆ చాకిరి అంతా ఎవరు చెయ్యాలి?

''ఇదిగో....సుందరీ! ఓ నాలుగు రోజు లుండి వచ్చేయ్....'' అంది సాగదీసుకుంటూ!

''మా అమ్మ చెప్పింది విన్నావా? ఓ నాలుగు రోజులకంటె ఎక్కువ వుండటానికి వీలులేదు. తీరా మీ అన్నయ్య వచ్చాడని పంపుతున్నాను...'' అన్నాడు భర్త.

వాళ్ళ ఎదురుగా మాత్రం ''సరే! అలాగే'' అని తలూపి అక్కడ్నుంచి ఎలాగో బయట పడింది. కాని ఆ నరకంలోకి ఇప్పుడిప్పుడే వెళ్ళ దల్చుకోలేదు. వచ్చి పది రోజులు అవుతోంది! ఇంకో పదిరోజులు ఎలాగో గడిపేసిందంటే దసరా! బతకమ్మ సంబరం వస్తుంది. ఆ తరు వాతే వెళ్ళటం! అంతగా అయితే వెళ్ళాక రెండు తంతాడు! ''ఇన్ని రోజులు పుట్టింట ఎందు కున్నావ్'' అని రెండు తగిలిస్తాడు! కానియ్ అది తనకి అలవాటే!

పండగకో పబ్బానికో పదిరోజుల పాటయినా, పుట్టింట్లో వుండలేకపోతే ఇంకెందుకు బ్రతుకు? అక్క, అమ్మ కూడా ఎదురింటి పెళ్ళికి వెళ్ళారు! అసలు పెళ్ళంటే తనకి ఎన్ని కలలు? ఎన్ని కోరికలు? వాటన్నింటికి ఆలంబన శేఖరం బావ! స్వయాన మేనత్త కొడుకు!....

చెయ్యెత్తు నిలువుతో బలంగా ఆకర్షణీయంగా వుండేవాడు. అతడికి తనంటే ఎంత ప్రేమ!

''సుందీ! నీ అంత అందమైన మరదల్ని ఒదులుకొని వేరే చేసుకుంటానా?'' అనేవాడు అభిమానంగా.

ప్రతీసారి శలవులకి తమ ఊరు వచ్చేవాడు! తనకి చిన్న చిన్న ప్రేమ కానుకలు తెచ్చేవాడు. తన మనసునిండా కమ్మని కలల్ని నింపేవాడు! ఎన్ని బాసలు చేశాడు! ఎన్ని ప్రమాణాలు చేశాడు!

అతడు అంత చేసినా తనకి సంశయమే! తన అదృష్టం మీద అపనమ్మకమే!

''బావా! మేం పేదవాళ్ళం కదా?'' అంటే...

''మేం మాత్రం గొప్పవాళ్ళమా?'' అనేవాడు!

''నిజమే! కాని నువ్వు పెద్ద చదువు చదువు కుంటున్నావ్. రేపు పెద్ద ఉద్యోగం వస్తే....''

''ఊఁ....వస్తే?''

''మేం ఎక్కువగా కట్నం ఇచ్చుకోలేం కదా?'' దిగులు దిగులుగా తన సంశయాన్ని బయట పెట్టేది.

కాని ఆప్యాయంగా తన చేతిని పట్టుకునేవాడు!

''నువ్వు వట్టి పిచ్చిపిల్లవి సుందరి! కట్నం దేముంది? నీలాంటి అందమైన బుద్ధిమంతురాలే గొప్ప కట్నం!'' అనేవాడు కొంటెగా.

ఏకాంతంగా ఎన్నో బాసలు చేశాడు. ఆశలు రేపాడు! ప్రమాణాలు చేశాడు! కాని చివరికి అవి అన్నీ గాల్లో కలిసి పొయ్యాయి.

అతడికి అదృష్టం కలిసి వచ్చింది. మంచి ఆఫీసరు ఉద్యోగం అయింది. అంతే! నిముషాల మీద అతడి 'డిమాండ్' పెరిగిపోయింది. పదిహేను వేల కట్నంతో వేరే సంబంధం చేసు కున్నాడు! ఆశ చావక తీరా నాన్న అడిగితే—

''నన్ను ఏం చెయ్యమంటావ్ మామయ్యా! అమ్మ ఒప్పుకోవటం లేదే. ఆవిడ నీ చెల్లెలు. నాకంటే ఆవిడకే మీపై మమకారం ఎక్కువ వుండాలి. అమ్మ ఒప్పుకుంటే నాకేం అభ్యంతరం లేదు'' అన్నాడుట శేఖరం బావ. నాన్న దిగాలు పడి వచ్చారు! ఆరోజు తనెంత ఏడ్చింది? అత్తయ్య డబ్బు మనిషే, కాని శేఖరం వ్యక్తిత్వం మాట ఏమిటి?....

ఆ విరక్తిలోనే శంకరంతో పెళ్లికి ఒప్పుకుంది.

అయితే మాత్రం తన కలలు ఇలా కరిగి పోవాలనేముంది? జీవితాంతం ఏడవాలనేముంది? కాని తన ఖర్మ!

శంకరంలాంటి మోటు భర్తతో సారంలేని జీవితం గడపమని భగవంతుడు తన నొసట వ్రాశాడు! అదే జరిగింది!....

జర్మనీలోని మ్యూనిచ్ నగరంలో ఒక జీవితభీమా సేల్స్‌మాన్, భార్య నుంచి విడా కులు పొందడానికి ఒక అర్జీ పెట్టుకున్నాడు. ఇంతకీ ఆయన అంత హఠాత్తుగా విడాకులు పుచ్చుకునేందుకు నిర్ణయించడానికి కారణం— ఆమె అతనికి చెప్పా పెట్టకుండా రహస్యంగా తన 42 అంగుళాల వక్ష సౌందర్యాన్ని శస్త్ర ఆపరేషన్ ద్వారా తగ్గించుకోవడంట!

''నేను నా భార్యని—ఆమె ఆ సౌందర్యం చూసే వివాహం చేసుకున్నాను. నాకు తెలియ కుండా ఆపరేషన్ చేసుకు వచ్చిన తరువాత నేను ఆమెను చూసి దిగ్భ్రాంతి చెందాను. అప్పటి నా పరిస్థితి మీరే ఊహించండి'' అన్నాడట.

ఆ న్యాయాధికారి కేస్ అంతా పరిశీలించి భర్త వైపే తన సానుభూతి మొగ్గించి, ''ఆపరేషన్ చేసుకునే ముందు తన భర్తకి ముందుగా ఆమె తెలియబరిచి వుండవల సింది'' అన్నాడు. 'ఇంతకీ ఇదంతా నేను నా భర్త కంటికి మరింత ఆకర్షణీయంగా కనిపించాలన్న ఉద్దేశ్యంతోనే చేశాను' అని వాపోయిందిట ఆ ఇల్లాలు.

ఎ. కన్యాకుమారి

ప్రముఖ గాయకురాలు - ఎం. ఎల్. వసంత కుమారితో కచ్చేరీలు చేసి విఖ్యాత వయొలినిస్టుగా పేరుపొందారు అవసరాల కన్యాకుమారి. 1974లో నేపాల్ మహారాజు, మహారాణిల ఆహ్వానంపై ఎం. ఎల్. వి తో బాటు ఆమె నేపాల్ పర్యటించారు. 1975 లో తిరిగి ఆమెతోటే మలేషియా, సింగపూర్‌లలో జరిగిన 12 ప్రదర్శనలలో పాల్గొన్నారు. ఆ మరుసటి సంవత్సరం ఆమె కెనడా, అమెరికా దేశాలలో - 33 కచేరీలలో పాల్గొన్నారు.

ప్రముఖ వయొలిన్ విద్వాంసులు – శ్రీ ఇవటూరి విజయేశ్వరరావుగారి దగ్గర కన్యాకుమారి వయొలిన్ విద్య అభ్యసించారు. సుస్వరాలతో సున్నితంగా పలికించడం ఆమె వాద్యములోని ప్రత్యేకత.

1971–73 లో రెండు సంవత్సరాలపాటు ఆమె కేంద్రప్రభుత్వం ఉపకారవేతనం పొందారు. కళలలో ఉత్సాహం వున్న యువతిని ప్రోత్సహించ డానికి యిచ్చే ఉచితవేతనం అది. అప్పుడే ఆమె ప్రముఖ వయొలిన్ విద్వాంసులు శ్రీ ఎమ్. చంద్రశేఖరన్ వద్ద ప్రత్యేక శిక్షణ పొందారు.

ఇంతేకాక 1969 లో మద్రాసు మ్యూజిక్ అకాడెమీలోనూ, ఇండియన్ ఫైన్‌ఆర్ట్స్‌లోనూ, 1970 లో ఆలిండియా రేడియో నిర్వహించిన సంగీత పోటీలలోనూ పాల్గొని ఆమె ప్రథమ బహుమతులు అందుకున్నారు. ఈ సంవత్సరం కూడా మ్యూజిక్ అకాడెమీవారు నిర్వహించిన పోటీలలో ఉత్తమ వయొలిన్ విద్వాంసురాలుగా ఆమె ప్రథమ బహుమతిని అందుకోవడం మరో విశేషం!

1974 నుంచి ఆమె రేడియోలో – జాతీయ కార్యక్రమాలలోనూ, సంగీత సమ్మేళన కచ్చేరీల లోనూ పాల్గొంటున్నారు.

ఆరేళ్ళుగా ఎం. ఎల్. వసంతకుమారితో పాటు దేశ, విదేశాలలో ఎన్నో కచ్చేరీలు చేసిన కన్యాకుమారి డి. కె. పట్టమ్మాళ్, బాలమురళీకృష్ణ, టి. ఆర్. మహాలింగం తదితర ప్రముఖ విద్వాంసులతో పాటు కచ్చేరీలు చేశారు. తనే స్వయంగా కొన్ని ప్రదర్శనలు యిచ్చారు. పలువురి ప్రశంసలు పొందారు.

కన్యాకుమారి కేవలం సంగీతంలోనే కాక చదువులోనూ 'సరస్వతి' అనిపించుకున్నారు. సంగీతం, తత్వశాస్త్రం, మనస్తత్వశాస్త్రాలు ముఖ్య పాఠ్యభాగాలుగా ఆమె మద్రాసు విశ్వ విద్యాలయం నుంచి బి. ఎ ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణురాలయ్యారు. మద్రాసు విశ్వవిద్యాలయం నుంచి బహుమతి కూడా పొందారు. ఆంధ్ర విశ్వ విద్యాలయం నిర్వహిస్తున్న డిప్లొమా పరీక్షలో శాస్త్రీయ, కర్ణాటక సంగీతంలో-వయొలిన్‌లో మొదటి తరగతిలో కూడా ఆమె వుత్తీర్ణురాలయ్యారు.

"సీతమ్మ పెళ్ళికూతురాయెనె
రామయ్య పెండ్లి కొడుకాయెనె...."

ఆలోచనలతో నలుగుతున్న సుందరి ఒక్కసారిగా త్రుళ్ళిపడి తెప్పరిల్లింది.

ఎదిరింటి పెండ్లి పందిరిలో నుంచి పెద్ద బ్యాండుమేళం వినిపించింది.

"మాంగల్యం తంతునా నేనా...."

మైకులోనుంచి మంత్రాలు వినిపించాయ్! అంతే! ఆ మూడు ముళ్ళు పడ్డాయ్.

పెళ్ళి పెద్దలంతా వధూవరులపై అక్షతలు చల్లారు. కెమెరాలు క్లిక్‌మన్నాయి. ఫిల్మ్ కూడా తీస్తున్నారుట!

ఆ పవిత్ర దృశ్యాన్ని కిటికీ వూచలు పట్టుకుని తిలకిస్తున్న సుందరి శరీరం ఝల్లు ఝల్లుమంది. తెలియని వింత అనుభూతితో కళ్ళల్లో సన్నటి నీటి పొర క్రమ్మింది!

"తన భర్త మూర్ఖుడు! భార్యని తిన్నావా లేదా అని అడగడు! కష్టం సుఖం విచారించడు! పవిత్రమైన వివాహ బంధాన్ని నిరసించి భార్యని గడ్డి పోచలా చూస్తున్నాడు!........

"ధణేల్........"

విసురుగా శబ్దం వినవచ్చింది.

సుందరి చివ్వున వెనక్కి తిరిగింది.

"సుందరి....సుందరి...." అంటూ వీధి తలుపు నెట్టుకుని అన్నగారు ఎవరో తరుము తున్నట్లుగా లోపలికి వచ్చాడు!

"సుందరీ! బావ వచ్చాడే...." అన్నాడు హడావుడిగా!

త్రుళ్ళిపడింది సుందరి. పిచ్చిదానిలా బిత్తర చూపులు చూసింది.

"నిన్నేనే? చెప్పింది వినిపించలే? బావ వచ్చాడు...."

"ఎ....ఏ....బావ?" తత్తరపాటుగా అడిగింది.

"శంకరం బావే! నిన్ను తీసుకుని వెళ్ళటానికి వచ్చాడు. నాలుగు రోజుల్లో వచ్చెయ్యమంటే నువ్వు పది రోజులయినా వెళ్ళలేదని చాలా కోపం మీద వున్నాడే?" అంటూ ఖంగారు ఖంగారుగా తిరిగి వీధి వసారాలోకి వెళ్ళాడు.

సుందరి 'కల' చెదిరింది!

ఒక్కసారిగా స్వర్గంలోంచి నరకంలోకి ఎవరో తోస్తే వచ్చి పడినట్లుగ అయ్యింది ఆమె పరిస్థితి!

శరీరంలోని జీవశక్తి అంతా నశించి పోయినట్లు. మొదలు నరకిన వృక్షంలా వున్నచోటే కుప్పలా కూలబడిపోయింది. గుండెలు రెట్టింపు వేగంతో కొట్టుకుంటున్నాయ్. శరీరంలో సన్నగా ఒణుకు ప్రారంభమైంది.

"సీతమ్మ పెళ్ళికూతురాయెనె....రామయ్య పెండ్లికొడుకాయెనే...."

పందిట్లో సన్నాయ్ మ్రోగుతూనే వుంది!

సుందరి గుండెల్లో అలజడి రేగుతూనేవుంది! □